క్లుప్తంగా

ఘనంగా అయ్యప్ప దేవస్థాన ప్రతిష్ట దినోత్సవం



నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్ప దేవస్థాన ప్రతిష్ట దినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. సుప్రభాతసేవ, క్షీరాభిషేకం, గణపతి హోమం, అయ్యప్పస్వామికి నెయ్యాభిషేకం, నవకలశాభిషేకం, పుష్పాభిషేకం తదితరాలను జరిపారు. అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గద్దం రత్నయ్య, శంకర్, జగన్నాథం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రంగడి సన్నిధిలో భీష్మ ఏకాదశి నేడు

నెల్లూరు(బృందావనం): భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో తిరుమంజనం, స్వర్ణ గరుడసేవను శనివారం నిర్వహించనున్నామని ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు విశేషంగా తరలిరావాలని కోరారు.

నాణ్యత ప్రమాణాలను పాటించాలి

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తన కార్యాలయంలో కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి వ్రతం నేడు

నెల్లూరు(బృందావనం): భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని పప్పులవీధిలోని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని శనివారం ఉదయం నిర్వహించనున్నామని నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

క్రిస్టియన్ సెల్‌ను ఏర్పాటు చేయరూ..

నెల్లూరు(బృందావనం): కాంగ్రెస్ పార్టీలో క్రిస్టియన్ సెల్ ఏర్పాటుకు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ రాజశేఖర్ దాసరి కోరారు. ఈ మేరకు నగరానికి వచ్చిన ఆ పార్టీ జాతీయ నేత కొప్పుల రాజుకు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు.

సహకార సంఘాలతోనే మెరుగైన ప్రపంచం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సహకార సంఘాలతోనే మెరుగైన ప్రపంచం ఏర్పడుతుందని డీసీఓ గుర్రప్ప పేర్కొన్నారు. నగరంలోని డీసీఓ కార్యాలయం నుంచి సహకార శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను శుక్రవారం నిర్వహించారు.

11న ప్రత్యేక విద్యుత్ అదాలత్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరు రూరల్ డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను ఈ నెల 11న నిర్వహించనున్నామని ఈఈ సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యుత్ భవన్‌లోని తన చాంబర్‌లో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. రాపూరు, సైదాపురం, పొదలకూరు, మనుబోలు, తోటపల్లిగూడూరు, కలువాయి, నెల్లూరు రూరల్, ముత్తుకూరు, వెంకటాచలం, విరువూరు, కావేరినగర్, బుజబుజనెల్లూరు, నారాయణరెడ్డిపేట ప్రాంత వినియోగదారుల కోసం విద్యుత్ అదాలత్‌ను నిర్వహించనున్నామని చెప్పారు. సమస్యలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని కోరారు.

ఖాళీ స్థలాల్లో చెత్త తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డికాలనీలో మ్యాన్‌హోళ్లు నిండిపోయి రోడ్లపై మురుగు ప్రవహిస్తుండటంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో పడకేసిన పారిశుధ్యం అనే శీర్షికన సాక్షిలో కథనం శుక్రవారం ప్రచురితమైంది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శానిటేషన్ సిబ్బంది జనార్దన్‌రెడ్డి కాలనీకి చేరుకున్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వీధిలోని మ్యాన్‌హోళ్లను శుభ్రం చేయడంతో పాటు ఖాళీ ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు.

లక్షలు వెచ్చించినా ప్రయోజనమేదీ..?

- నిరుపయోగంగా పినాకినీ అనెక్సరీ
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- మరమ్మతులు చేస్తే పూర్వవైభవం



పినాకినీ అనెక్సరీ భవనం

నెల్లూరు (పొగతోట): ప్రజాప్రతినిధులు, అధికారుల కోసం రూ.లక్షలను వెచ్చించి నగరంలో ఏర్పాటు చేసిన పినాకినీ గెస్ట్‌హౌస్ నిరుపయోగంగా మారుతోంది. స్వర్ణాల చెరువు గట్టు పక్కన 20 ఏళ్ల క్రితం దీన్ని నిర్మించారు. తదనంతరం 15 ఏళ్ల క్రితం రూ.లక్షలతో ఆధునికీకరించారు. ఆ సమయంలో పినాకినీ అనెక్సర్‌గా నామకరణం చేసి నాలుగు రూమ్‌లను నిర్మించారు. జిల్లా సమావేశాలు, ఇతర పర్యటనల నిమిత్తం వచ్చే మంత్రుల సిబ్బందికి ఇక్కడ రూమ్‌లను కేటాయించే వారు.

అనతి కాలంలోనే..

నిర్మించిన అనతికాలంలోనే పినాకినీ అనెక్సరీ మరమ్మతులకు గురైంది. పట్టించుకునే నాథుడే లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. సాయంత్రం ఆరు దాటాక మందుబాబు భవనంపైకెక్కి మద్యం సేవిస్తున్నారు. విద్యుద్దీపాల్లేకపోవడంతో వీరిని అడ్డుకునే వారే కరువయ్యారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి భవనానికి పూర్వ వైభవం తీసుకొచ్చేలా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఫైనల్స్ చేరిన నెల్లూరు జట్టు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): బుజబుజనెల్లూరులోని మైదానంలో ఇంటర్ సర్కిల్ క్రికెట్ టోర్నీని ఏపీ ట్రాన్స్‌కో, నెల్లూరు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. సెమీఫైనల్స్‌ను శుక్రవారం నిర్వహించగా, నెల్లూరు – విజయవాడ జట్లు తలపడ్డాయి. ఇందులో నెల్లూరు జట్టు విజయం సాధించి ఫైనల్స్ చేరుకుంది. విశాఖపట్నం జట్టుతో నెల్లూరు శనివారం తలపడనుంది. ఎస్పీడీసీఎల్ జిల్లా స్పోర్ట్స్, గేమ్స్ సెక్రటరీ వేలు, ఎస్ఈ విజయన్, నెల్లూరు రూరల్ డీఈ సోమశేఖర్‌రెడ్డిని వీరు కలిశారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు



సూచనలు చేస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థకు సంబంధించిన రిజర్వ్‌డ్ ఖాళీ స్థలాలను ఆక్రమిస్తే వారిపై చర్యలు తప్పవని, ఆయా నిర్మాణాలను కూల్చేస్తామని కమిషనర్ సూర్యతేజ పేర్కొన్నారు. 38వ డివిజన్లోని రమేష్‌రెడ్డినగర్, ఆచారివీధి, సీఏఎం హైస్కూల్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. నగరపాలక సంస్థకు చెందిన రిజర్వ్ ఖాళీ, ప్రభుత్వ స్థలాలను గుర్తించి మార్కింగ్ చేయాలని ఆదేశించారు. ప్రైవేట్ స్థలాలను వాటి యజమానులే శుభ్రం చేసుకునేలా నోటీసులను జారీ చేసి, వార్డు సచివాలయ అడ్మిన్, శానిటేషన్, ప్లానింగ్, అమెనిటీస్ కార్యదర్శులు పర్యవేక్షించాలని కోరారు. ప్రధాన కాలువలను 15 రోజులకోసారి శుభ్రం చేసి పూడికతీత పనులను చేపట్టాలని సూచించారు. వైఎమ్సీఏ గ్రౌండ్స్ ఎదురుగా ఉన్న పంట కాలువను ఆక్రమిస్తూ చేపట్టిన నిర్మాణాన్ని వెంటనే ఆపేయాలని అదేశించారు. అక్రమ నిర్మాణాలను గుర్తించక, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న స్థానిక ప్లానింగ్ సెక్రటరీకి షోకాజ్ నోటీసులను జారీ చేయాలని చెప్పారు. కాలువల వెంట జంగిల్ క్లియరెన్స్ చేయించి మురుగు ప్రవాహానికి ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.

ఎంహెచ్‌ఓకు షోకాజ్ నోటీస్

ఏసీ కూరగాయల మార్కెట్ సమీపంలోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ గతంలో పరిశీలించారు. కొన్ని మార్పులను సూచించగా, దీన్ని అమలు చేయకపోవడంతో హెల్త్ ఆఫీసర్ చైతన్యకు షోకాజ్ నోటీస్‌ను జారీ చేయాలని ఆదేశించారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



నెల్లూరు(అర్బన్): నగరంలోని ఎన్జీఓ అసోసియేషన్ కార్యాలయంలో ఏపీ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల టేబుల్ క్యాలెండర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు మాట్లాడారు. గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు 010 పద్దు కింద జీతాలివ్వాలని ఎంతోకాలంగా కోరుతున్నామని చెప్పారు. ఉద్యోగోన్నతులకు నోచుకోవడంలేదని, ఈ సమస్యలను రాష్ట్ర నాయకత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, నేతలు నందిమండలం ఆంజనేయవర్మ, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్కాకుల పెంచలయ్య, కోశాధికారి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీసీఎమ్మెస్ బీఎంగా మోహనకృష్ణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): డీసీఎమ్మెస్ బిజినెస్ మేనేజర్‌గా మోహనకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ ఆనంద్ నుంచి ఉత్తర్వులు అందాయి. నెల్లూరు సహకార శాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో బీఎంగా ఉన్న వెంకటస్వామి ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు. ఈ క్రమంలో మోహనకృష్ణను నియమించారు.

‘డీకేడబ్ల్యూ’లో ఎండోమెంట్ లెక్చర్



నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఎండోమెంట్ లెక్చర్‌ను ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఇంగ్లిష్ ఫర్ ఎంప్లాయబిలిటీ అనే అంశంపై అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ నరేంద్రకుమార్ అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ గిరి, అధ్యాపకులు కృష్ణమూర్తి, ఉమామహేశ్వరి, వెంకటేశ్వర్లు, వింధ్యావళి, తమన్నా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీవీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని మాగుంట లేఅవుట్, లెక్చరర్స్ కాలనీ, రవీంద్రనగర్, మినీబైపాస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12.30 వరకు.. సరస్వతీనగర్ సబ్‌స్టేషన్‌లో పరిధిలోని సరస్వతీనగర్, రామ్‌నగర్, పాత మిలటరీ కాలనీ, క్రాంతినగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

- రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పుత్తా ఎస్టేట్స్, పొర్లుకట్ట, మనుమసిద్ధినగర్, ఉయ్యాలకాలువకట్ట, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని వివరించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ



నెల్లూరు (టౌన్): విద్యార్థులకు చిన్నతనం నుంచే నైపుణ్యాలను పెంపొందించాలని సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. ఒకటి, రెండో తరగతులు విద్యార్థులకు ఆటల ద్వారా పునాది అభ్యసనంపై ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని గొలగమూడిలోని ఐఐటీఎంలో నిర్వహిస్తున్నారు. దీన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఏఎంఓ సుధీర్‌బాబు, కేఆర్పీలు సుధాకర్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఫీవర్ సర్వే పరిశీలన



నెల్లూరు(అర్బన్): ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమంలో భాగంగా కపాడిపాళెంలోని పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో నిర్వహిస్తున్న ఫీవర్, లార్వా సర్వేను జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మలేరియా, డెంగీ, ఫైలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధులను నియంత్రించాలంటే దోమలు ఉత్పత్తి కాకుండా చూడాలని కోరారు. పారిశుధ్యాన్ని మెరుగుపర్చుకోవాలని సూచించారు.

కాకాణికి సత్కారం



నెల్లూరు(బారకాసు): ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ నియోజకవర్గ స్థాయిలో పదవులు పొందిన వారు నేతలు, కార్యకర్తలతో కలిసి డైకస్‌రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయానికి శుక్రవారం తరలివచ్చారు. ఈ సందర్భంగా కాకాణికి శాలువాలు కప్పి గజమాలతో సత్కరించారు. దీంతో పార్టీ కార్యాలయంలో సందడి నెలకొంది.

పెన్‌కాక్ సిలాట్‌లో ప్రతిభ



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సౌతిండియా ఖేలో ఇండియా పెన్‌కాక్ సిలాట్ పోటీల్లో నెల్లూరుకు చెందిన పానుగోటి యశస్విని ప్రతిభ చూపారు. తమిళనాడులోని తిరుచిరాపల్లిలో నిర్వహించిన అండర్ – 16 విభాగంలో కాంస్య పతకాన్ని సాధించారు.

న్యాయవాదుల నిరసన

నెల్లూరు(లీగల్): కర్నూల్లో ఏర్పాటు చేయనున్న రాయలసీమ హైకోర్టు బెంచ్ పరిధిలోకి నెల్లూరు జిల్లాను చేర్చడాన్ని నిరసిస్తూ కోర్టు విధులను నాయవాదులు నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బహిష్కరించారు. అనంతరం కోర్టు ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుందరయ్య యాదవ్ మాట్లాడారు. అక్కడి బెంచ్‌లోకి జిల్లాను కలిపితే కక్షిదారులకు ఇబ్బందులు తప్పవన్నారు. కర్నూలు వద్దు.. అమరావతి ముద్దు అంటూ నినాదాలు చేశారు.

రామిరెడ్డి స్మారక మందిర ఏర్పాటుకు వినతి

నెల్లూరు(అర్బన్): స్వాతంత్ర్య సమరయోధుడు, జిల్లాకు చెందిన కవికోకిల దువ్వూరు రామిరెడ్డి స్మారక మందిరాన్ని ఏర్పాటు చేయాలని దువ్వూరు రామిరెడ్డి విజ్ఞాన సమితి ట్రస్ట్ కార్యదర్శి సురేంద్రనాథ్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మాగుంట లేఅవుట్లో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. నేతలు చలంచర్ల భాస్కర్‌రెడ్డి, కొండా లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలువలో మృతదేహం లభ్యం

నెల్లూరు సిటీ: అల్లీపురం ప్రాంతంలోని వరిగొండ కాలువలో గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని శుక్రవారం కనుగొన్నారు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. కాలువలోని నీటి ప్రవాహ లాక్ వద్ద గుర్తుతెలియని మహిళ (45) మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటన స్థలానికి చేరుకొని పోలీసులు పరిశీలించారు. నగరం నుంచి కొట్టుకొచ్చి ఉంటుందని భావిస్తున్నారు. పది రోజుల క్రితం మృతి చెంది ఉండొచ్చని అనుమానిస్తున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల సహకారంతోనే నేర నియంత్రణ



సమస్యలు ఆరాతీస్తున్న సింధుప్రియ

నెల్లూరు(క్రైమ్): ప్రజల సహకారంతోనే నేర నియంత్రణ సాధ్యమవుతుందని నగర డీఎస్పీ సింధుప్రియ పేర్కొన్నారు. నగరంలోని వీవర్స్‌కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో నగరనిద్ర కార్యక్రమాన్ని నవాబుపేట పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ప్రజల నుంచి సమస్యలను స్వయంగా తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆమె హామీ ఇచ్చారు. మహిళలు, చిన్నారుల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, చైల్డ్, ఉమెన్ హెల్ప్‌లైన్లు, చోరీల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలు, సీసీ కెమెరాల ఆవశ్యకత తదితరాలపై అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యకలాపాలు, మత్తు, మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలు, అనుమానాస్పద వ్యక్తుల సంచరిస్తున్నారని గుర్తిస్తే 112కు సమాచారం అందించాలని కోరారు. ట్రైనీ డీఎస్పీ శివప్రియ, ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా, ఎస్సైలు రెహమాన్, శివయ్య, కార్పొరేటర్ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆదాలతో కాకాణి భేటీ



నెల్లూరు(బారకాసు): మాజీ ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం కలిశారు. పార్టీ బలోపేతం, రాజకీయ అంశాలపై చర్చించారు.

- ఆదాల ప్రభాకర్‌రెడ్డిని పార్టీ మహిళా విభాగ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీసునంద మర్యాదపూర్వకంగా కలిశారు.

చిన్నారులతో పనిచేయిస్తే చర్యలు



మాట్లాడుతున్న వాణి

నెల్లూరు సిటీ: చిన్నారులతో ఎవరైనా పనులు చేయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి పేర్కొన్నారు. కోడూరుపాడులోని ఇటుక బట్టీలు, రొయ్యల ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న కుటుంబాలను శుక్రవారం ఆమె కలిశారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఆయా ఫ్యాక్టరీల నిర్వాహకులు చిన్నారులతో ఎలాంటి పనులు చేయించకూడదని తెలిపారు. చదువుకు దూరంగా ఉన్న పిల్లలను వసతిగృహాల్లో చేర్పించి విద్యనందిస్తామని చెప్పారు. ఫ్యాక్టరీ నిర్వాహకుల నుంచి ఎలాంటి ఇబ్బందులున్నా, టోల్‌ఫ్రీ నంబర్ 15100ను సంప్రదించాలని సూచించారు. జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్, లేబర్ ఆఫీసర్లు రామారావు, హరిబాబు, ఏఎస్సై సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో స్తంభ ప్రతిష్ట



నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రిని పురస్కరించుకొని మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 21 నుంచి మార్చి ఐదు వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్న నేపథ్యంలో స్తంభ ప్రతిష్ఠను శుక్రవారం జరిపారు. తొలుత గోపూజను నిర్వహించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ప్రాక్టికల్స్ నిర్వహణ



మాట్లాడుతున్న శ్రీనివాసులు

నెల్లూరు (టౌన్): ఈ నెల పదిన ప్రారంభంకానున్న ఇంటర్ ప్రాక్టికల్స్‌ను పారదర్శకంగా నిర్వహించాలని ఆర్ఐఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు, ఎగ్జామినర్లతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అన్ని వసతులను కల్పించాలని సూచించారు. డీవీఈఓ మధుబాబు, పరీక్షల కమిటీ జిల్లా సభ్యులు దీన్‌దయాళ్, వేణుగోపాల్, కొండయ్య, అధ్యాపకుడు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు జిల్లాలో 34 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు 283 మందికి గానూ 265 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిపిన ప్రాక్టికల్స్‌కు 277 మందికి గానూ 16 మంది గైర్హాజరయ్యారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం



మాట్లాడుతున్న కొప్పుల రాజు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీడబ్ల్యూసీ శాశ్వత సభ్యుడు కొప్పుల రాజు పేర్కొన్నారు. నగరంలోని ఇందిరాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ సదస్సు లో ఆయన మాట్లాడారు. జైభీమ్, జైబాపు, జైసంధాన్ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా ఈ సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యాంగ విలువలు, హక్కులపై గ్రామస్థాయి నుంచి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రాజ్యాంగాన్ని నిర్మించిన అంబేడ్కర్ వంటి వారిపై అగౌరవంగా మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని మార్చేందుకు సైతం బీజేపీ నాయకత్వం సిద్ధ పడిందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు మస్తాన్‌వలీ, డీసీసీ అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి, పీసీసీ సభ్యులు ఉడతా వెంకట్రావ్ యాదవ్, డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, నేతలు గోపాల్‌రెడ్డి, డాక్టర్ యశోధర, కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలువురికి పరామర్శ



నెల్లూరు(బారకాసు): సీనియర్ న్యాయవాది మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డిని మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఫతేఖాన్‌పేటలోని శాంతినగర్‌లో ఆయన్ను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నేతలు మలిరెడ్డి కోటారెడ్డి, స్వర్ణా వెంకయ్య, పాశం శ్రీనివాస్, యేసునాయుడు, హరిబాబుయాదవ్, మల్లు సుధాకర్‌రెడ్డి, హంషీద్ అలీ, కొండేటి నరసింహరావు, కల్లూరు లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- గుడిపల్లిపాడులో మద్దినేని అన్నయ్యచౌదరి మరణించారు. ఈ నేపథ్యంలో ఆయన పార్థివదేహానికి ఆదాల నివాళులర్పించారు. కిమ్స్ హాస్పిటల్ ఈడీ గిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంతాన సాఫల్య కేంద్రం ప్రారంభం



నెల్లూరు(అర్బన్): నగరంలోని గోమతినగర్ వద్ద నిర్మించిన మైత్రి ఫెర్టినెస్ట్ సంతాన సాఫల్య కేంద్రాన్ని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు రూరల్, కోవూరు ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డాక్టర్ గునపాటి మిథిలశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రూరల్ డీఈఈగా ప్రభాకర్



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ పరిధిలో కన్‌స్ట్రక్షన్స్ విభాగ డీఈఈగా విధులు నిర్వర్తిస్తున్న ప్రభాకర్‌ను నెల్లూరు రూరల్ సబ్ డివిజన్ డీఈఈగా బదిలీ చేశారు. అన్నమయ్య జిల్లాలో డీఈఈగా విధులు నిర్వర్తిస్తున్న సురేష్ బాబు కన్‌స్ట్రక్షన్స్ విభాగ డీఈఈగా నియమితులయ్యారు. వీరిద్దరూ ఎస్ఈ విజయన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు.

విద్యుత్ సిబ్బందితో సమీక్ష



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని బీవీనగర్ సబ్‌స్టేషన్లో సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని డీఈఈ అశోక్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని కార్యాచరణను రూపొందించుకోవాలని కోరారు. బీవీనగర్ సెక్షన్‌కు ఆరు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేశామని వివరించారు. మొండి బకాయిలను వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. డీలిస్ట్‌ను పక్కాగా అమలు చేయాలని సూచించారు. ఏఈ దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): యువతి అదృశ్యమైన ఘటనపై కేసును బాలాజీనగర్ పోలీసులు శుక్రవారం రాత్రి నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వెలగచెట్టు సంఘంలో నివాసం ఉంటున్న కృష్ణయ్య కుమార్తె నగరంలోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో పనిచేస్తున్నారు. బ్యాంక్‌కు వెళ్లిన ఆమె రాత్రయినా ఇంటికి రాకపోవడంతో గాలింపు చర్యలను కుటుంబసభ్యులు చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.